క్లుప్తంగా

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



స్టిక్కర్లను అతికిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : తక్షణమే కరెంట్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. బుధవారం 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో స్మార్ట్‌మీటర్లు వద్దు.. కరెంట్ బిల్లులు తగ్గించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు అధికారంలోకి రాగానే మద్దతు తెలపడం అన్యాయమన్నారు. స్మార్ట్‌మీటర్లతో అధికంగా కరెంట్ బిల్లులు వస్తాయని, పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలపై అదనపు భారం పడుతుందని, వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

రైతు నాయకుడికి నివాళి



నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): రైతుల సమస్యలపై పోరాడిన నాయకుడు కొల్లి నాగేశ్వరరావు అని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప కొనియాడారు. ఆయన 5వ వర్ధంతి సందర్భంగా బుధవారం సీఆర్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొల్లి నాగేశ్వరరావు కృష్ణా జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. ఆయన నిరంతరం రైతుల పక్షాన పోరాటం చేశారన్నారు. బీటీ పత్తి విత్తనాలను తగ్గించాలని కోరుతూ సుప్రీంకోర్టులో కేసు వేసి అన్నదాతలకు ఎంతో మేలు చేశారని పేర్కొన్నారు. నాయకులు డి.శ్రీనివాసరావు, మహేష్, రాముడు, రబియా, సోమన్న పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటితే ప్రత్యేక గుర్తింపు



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న డాక్టర్ శంకర శర్మ

కర్నూలు (టౌన్): క్రీడల్లో ప్రతిభ చాటితే ప్రత్యేక గుర్తింపు వస్తుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. బుధవారం స్థానిక బి.క్యాంపులోని సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో సబ్ జూనియర్ అండర్-14 వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమం, బహుమతుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు నగరం క్రీడలకు కేంద్రంగా తయారవుతుందన్నారు. తమ వంతుగా క్రీడలకు సహకారం అందిస్తామన్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన క్రీడాకారులు పాల్గొనడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం విజేత జట్లకు ట్రోఫీలు అందజేశారు.

అధికారుల నిర్లక్ష్యంతో అందని రేషన్

ఎమ్మిగనూరుటౌన్: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలోని పేద ప్రజలకు రేషన్ బియ్యం అందడం లేదని సీపీఐ నాయకుడు భాస్కర్ యాదవ్, పట్టణ కార్యదర్శి రంగన్న ఆరోపించారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌కు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. ఈనెల 17వ తేదీలోగా రేషన్ బియ్యం కార్డుదారులకు పంపిణీ చేయకపోవడంతో ఆ నెల రేషన్ బియ్యం కోటాను లబ్ధిదారులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. పట్టణంలో ఐదుకు పైగా రేషన్ దుకాణాలను సీజ్ చేయడంతో ఇన్‌చార్జ్ డీలర్ల ద్వారా రేషన్ బియ్యం పంపిణీని సకాలంలో అధికారులు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఈనెల రేషన్ బియ్యం అందేలా జిల్లా పౌరసరఫరా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశనగ	1,002	6,109
పొద్దుతిరుగుడు	3,819	4,710
ఆముదం	5,660	5,660
వాము	12,06	21,242
ఉల్లి	785	860
ఎండుమిర్చి	1,899	6,559
శనగలు	5,004	5,591
కందులు	2,219	6,714
మొక్కజొన్న	2,150	2,262
మినుములు	5,129	6,471
కొర్రలు	1,283	2,701
సోయాచిక్కుడు	1,911	1,911
సజ్జలు	2,000	2,000

ఫోన్ నం : 08518-257204, 257661

యోగా జీవితంలో భాగం కావాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- వచ్చే నెల 21 వరకు జిల్లాలో యోగాంధ్ర ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, చిత్రంలో మేయర్ బీవై రామయ్య, ఎస్పీ, జేసీ, కమిషనర్ తదితరులు



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, అధికారులు, ప్రజాప్రతినిధులు



యోగాసనాలు వేస్తున్న స్పెషలిస్టులు

కర్నూలు (టౌన్): యోగా అందరి జీవితాల్లో భాగం కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర క్యాంపెయిన్ కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. యోగా శిక్షకులచే యోగాసనాలు అభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి 69వ సమావేశంలో 2014 సంవత్సరంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరపాల్సిందిగా ప్రతిపాదించారని, ఈ ప్రతిపాదనను 177 దేశాలు ఆమోదించడం జరిగిందన్నారు. 2015 నుంచి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నట్లు చెప్పారు. జూన్ 21న విశాఖపట్నంలో 5 లక్షల మందితో నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నారన్నారు. ఈ నెల 21 నుంచి 27 వరకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించి వారికి శిక్షణ, అలాగే 28 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు మండలస్థాయిలో ప్రజాప్రతినిధులు, ప్రజలతో ఈవెంట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే వచ్చే నెల 2 నుంచి రంగోలి పోటీలు ఉంటాయని జూన్ 18, 19 తేదీల్లో పాఠశాలలు, కళాశాలలు, వర్సిటీల్లో యోగా సంబంధించి పాటల పోటీలు, పెయింటింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ఆరోగ్య భారత్ లక్ష్యంతో యోగా దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. యోగా వల్ల ఆరోగ్యంతో పాటు చదువు, ఆటల్లో చురుగ్గా ఉంటారన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటించారన్నారు. అనంతరం యోగాసనాలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా నగరంలోని టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో యోగా ఉత్సవాలకు సంబంధించిన బెలూన్‌ను ఎగురవేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, డీఎంహెచ్‌ఓ శాంతికళ, ఆయుష్ శాఖ డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూసా పనులపై నేడు విచారణ

కర్నూలు (సిటీ): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కాలేజీల్లో రూసా 1.0 కింద రూ.55 కోట్లతో భవనాలను నిర్మించారు. వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో చేపట్టిన భవనాల పనులు దాదాపు పూర్తయ్యాయి. సిల్వర్ జూబ్లీ కాలేజీలోని ఆడిటోరియం మినహా రూసా నిధుల వినియోగం, ప్రస్తుతం ఆ నిధులతో నిర్మించిన భవనాల పురోగతిపై ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఇచ్చిన నివేదిక ఆధారంగా విచారణ చేసేందుకు రూసా రాష్ట్ర డైరెక్టర్ ప్రత్యేక కమిటీని ఇటీవల ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.విజయ్‌కుమార్ నాయుడు, ద్రావిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కిరణ్ కుమార్, డిగ్రీ కాలేజీల ఆర్‌జేడీ (కడప) నాగలింగారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శశికళ, ఏపీఈడబ్ల్యూఐడీసీ కడప సర్కిల్ ఎస్ఈ ఎస్.శివకుమార్, ఏపీఎంఎస్ ఐడీఎస్ ఈఈ ఎ.శ్రీనివాసరెడ్డిని నియమించారు. ఈ కమిటీ నేడు ఆయా కాలేజీల్లోని భవనాలను పరిశీలించనుంది.

చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స



కోలుకున్న చిన్నారి లిఖితతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): తలపై ఇటుకలు పడటంతో తీవ్రంగా గాయపడిన ఏడేళ్ల చిన్నారికి కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణం పోశారు. చికిత్స వివరాలను బుధవారం ఆసుపత్రిలో న్యూరోసర్జన్ డాక్టర్ కేఎస్ విశ్వకుమార్ వివరించారు. ఆయన మాటల్లో.. 'ఎమ్మిగనూరులో ఈ నెల 16న భారీ వర్షానికి లిఖిత (7) అనే చిన్నారిపై ఇంటి పక్కన మూడో అంతస్తు నుంచి ఇటుకలు పడ్డాయి. ఇటుకలు తలపై పడటంతో పుర్రె ఎముక విరిగి మెదడుకు గుచ్చుకుని తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికంగా ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. పాపకు వెంటనే స్కానింగ్ చేసి సమస్యను గుర్తించి ఆపరేషన్ నిర్వహించాం. మెదడులో రక్తస్రావాన్ని తొలగించి తలకు టైటానియం స్క్రూ, ప్లేట్లను అమర్చాం. అనంతరం పాపను ఐసీయూలో ఉంచి పీడియాట్రిషియన్ డాక్టర్ ఆర్.మురార్జీ, డాక్టర్ కె.సింధూరరెడ్డి, డాక్టర్ మమత చికిత్స అందించారు. పాప కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జ్ చేసినట్లు ఆయన వివరించారు. హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి ఉన్నారు.

సంచార చికిత్స కేంద్రం తనిఖీ



సంచార చికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి రఘు

కర్నూలు(రూరల్): మండలంలోని గార్గేయపురం పీహెచ్‌సీ పరిధిలోని పసుపల గ్రామంలో బుధవారం నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి రఘు తనిఖీ చేశారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. గర్భిణులు రెండు డోసుల టీడీ వ్యాక్సిన్‌తో పాటు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల వరకు చిన్నారులకు వరకు టీకాలు వేయించడం వల్ల పలు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని చెప్పారు. అదే విధంగా ఆయన మాట్లాడుతూ.. రుబెల్ల వ్యాధి రాకుండా 9 - 12 నెలల వయస్సు చిన్నారులకు మెదటి డోస్, 16 - 24 నెలల చిన్నారులకు రెండవ డోస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. పిల్లలకు క్రమం తప్పకుండా వాక్సిన్లు వేయించాలని సూచించారు. వైద్యులు హేమలత, హనుమంతమ్మ, పీహెచ్ఎన్ నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'యోగాంధ్ర'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జి.శ్రీనివాస్

కర్నూలు(రూరల్): మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు నిర్వహించనున్న యోగాంధ్ర మాసోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జి.శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ఆయన బుధవారం కర్నూలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల నోడల్ అధికారులతో మాట్లాడుతూ. అందరూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. తహసీల్దారు టి.వి.రమేష్‌బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, మండల పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

రమణీయం..రంగస్వామి రథోత్సవం



కాత్రికిలో భక్తుల నడుమ సాగుతున్న రథోత్సవం

ఆలూరు రూరల్:మండలంలోని కాత్రికి గ్రామంలో కొలువైన రంగస్వామి, వేంకటేశ్వర స్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం రమణీయంగా సాగింది. వేడుకను తిలకించేందుకు ఆలూరు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల ప్రజలతో పాటు కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి.. రథంపై నున్న కలశానికి పండ్లను విసిరి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా కాత్రికి గ్రామం జనసంద్రంగా మారింది. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేశారు. 5.30 గంటలకు వేలాది భక్తులు నడుమ ఎదురు బసవన్న విగ్రహం వరకు రథాన్ని లాగి యథాస్థానానికి చేర్చారు. అంతకు ముందు ఆలయ అర్చకులు స్వామి వార్లకు కుంకుమార్చన, జలాభిషేకం, మహామంగళ హారతి, గంగ పూజ తదతర పూజలు చేపట్టారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆవును ఢీకొన్న బైక్

– ఇద్దరికి గాయాలు..ఆవు మృతి

ఆలూరు రూరల్: బైక్ ఆవును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదంలో ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. మండలంలోని హులేబీడు సమీపంలో హైవే- 167లో రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాలు.. ఆదోనికి చెందిన కృష్ణ, లక్ష్మి దంపతులు బైక్‌పై బళ్లారి నుంచి ఆదోనికి వెళ్తున్నారు. హులేబీడు వద్దనున్న ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో బైక్ ఆవును ఢీకొట్టింది. ప్రమాదంలో ఆవు అక్కడికక్కడే మృతి చెందగా..లక్ష్మి తీవ్రంగా గాయపడింది. కృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రాజీవ్‌గాంధీ సేవలు ఎనలేనివి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశం అభివృద్ధి చెందడానికి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన కృషి ఎనలేనిదని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు సుధాకర్‌బాబు అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నాయకులు రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో సమాచార, పంచాయతీ వ్యవస్థల అభివృద్ధి, కంప్యూటర్ రంగానికి రాజీవ్‌గాంధీ పునాదులు వేశారన్నారు. యువతకు ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి వారికి ఓటు వేసే హక్కును కల్పించారని చెప్పారు. జవహర్ నవోదయ విద్యాలయాలు నెలకొల్పి గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించారన్నారు. అనంతరం సీక్యాంప్ కూడలిలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దామోదరం రాధాకృష్ణ, జి.వెంకట శివారెడ్డి, బతుకన్న, బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, ప్రమీళ, వెంకట సుజాత, ఎన్.సుంకన్న, పోతుల శేఖర్, లాజరస్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన మద్యం, నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ డాక్టర్ నాయక్

ఆదోని రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న బోయ వీరేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్ బుధవారం తెలిపారు. ఆదోని పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన బోయ వీరేష్ కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప తాలూకాలోని నాగరహాళ్ గ్రామంలోని వైన్‌షాపులో కర్ణాటక మద్యం 90 ఎం.ఎల్. పరిమాణం గల ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ (9 బాక్సులు) ఆటో(ఏపీ21 టీజెడ్ 6047)లో తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. మద్యం బాక్సులను, ఆటోను సీజ్ చేశామన్నారు. బోయ వీరేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులను చూపుతున్న ఎస్ఐ నిరంజన్‌రెడ్డి

పెద్దకడబూరు: మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామంలో ఈనెల 7వ తేదీన జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసి వారి నుంచి డబ్బు, బంగారు, వెండిని రికవరీ చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వివరాలను వెల్లడించారు. ఈనెల 7న ముచ్చగిరి గ్రామానికి చెందిన కురుక మహాదేవకు చెందిన 18గ్రాముల బంగారు ఆభరణాలు, గుడిసెల రంగమ్మకు చెందిన 6గ్రాముల బంగారు ఆభరణాలు, 24తులాల వెండి ఆభరణాలు, రూ.51వేల నగదు దొంగతనానికి గురి అయ్యాయన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 11వ తేదీన కేసు నమోదు చేసి, ఛేదించినట్లు తెలిపారు. బుధవారం అదే గ్రామానికి చెందిన బోయ ఉరుకుందు, సూగూరు హరికృష్ణ, బోయ నరసింహులు గ్రామం బయట అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

యువత ఓటరుగా నమోదు కావాలి





మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య, హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు

కర్నూలు(సెంట్రల్): 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరూ ఓటరుగా నమోదు కావాలని పాణ్యం నియోజకవర్గ ఈఆర్‌ఓ, జేసీ డాక్టర్ బి.నవ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు, ట్రాన్స్‌జెండర్లను గుర్తించి ఓటరు నమోదుకు సహకరించాలని కోరారు. ప్రస్తుత లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 1177 డూప్లికేట్ ఓటర్లు ఉన్నారని, 500 మందిని నూతనంగా ఓటు హక్కు కోసం చేర్పించినట్లు వివరించారు. నియోజకవర్గంలో 1200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌ను ఫారం-8 ద్వారా చేపట్టనన్నట్లు చెప్పారు. ఓటరు నమోదు కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో ఓటర్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివాహం చేసుకొని వెళ్లిన మహిళలు, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తమ ఓటును అక్కడే బదిలీ చేసుకోవచ్చన్నారు. కాగా, డూప్లికేట్ ఓటర్లను తొలగించాలని, ఇందుకోసం బీఎల్‌ఓలు సక్రమంగా పనిచేసేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు జేసీని కోరారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కల్లూరు, పాణ్యం, గడివేముల తహసీల్దార్లు ఆంజనేయులు, నరేంద్రనాథ్, వెంకటరమణ, ఓర్వకల్ డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఎలక్షన్ డీటీ జి.అనురాధ పాల్గొన్నారు.

రాజ్‌కుమార్ కుటుంబానికి బాసటగా నిలుస్తాం



సంతాపం ప్రకటిస్తున్న వీసీ వెంకట బసవరావు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: ఆర్‌యూ జువాలజీ విభాగం కాంట్రాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీ డాక్టర్ టి.రాజ్‌కుమార్ కుటుంబానికి వర్సిటీ బాసటగా నిలుస్తుందని వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు అన్నారు. రాజ్‌కుమార్ అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించడంతో వర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంస్మరణ కార్యక్రమం నిర్వహించి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. కష్ట సమయంలో రాజ్‌కుమార్ కుటుంబానికి వర్సిటీ బాసటగా నిలుస్తుందన్నారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.25 వేలు తక్షణమే మంజూరు చేశామన్నారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు మాట్లాడారు. ఆచార్యులు పీవీ సుందరానంద్, సి.విశ్వనాథరెడ్డి, ఆర్.భరత్‌కుమార్, ఎస్.వెంకటేశ్వర్లు, బోధన, బోధనతర ఉద్యోగులు పాల్గొన్నారు. రాజ్‌కుమార్ నివాసం వద్ద ఆయన భౌతిక దేహానికి వర్సిటీ రెక్టార్, రిజిస్ట్రార్‌తో పాటు తదితరులు నివాళులర్పించారు.

స్కూటర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన సిద్ధయ్య, సయ్యద్

కర్నూలు : కర్నూలు మండలం వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ సమీపంలో (శ్రీనివాస గార్డెన్)కు ఎదురుగా కుంభకోణం హోటల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నందికొట్కూరు గ్రామానికి చెందిన పింజరి సిద్ధయ్య(59) మృతిచెందారు. ముల్లా సయ్యద్ గాయాలకు గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిద్దరూ కర్నూలు లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. బుధవారం స్కూటీపై నందికొట్కూరు నుంచి కర్నూలుకు వస్తుండగా కర్నూలు నుంచి ఆత్మకూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో స్కూటర్‌ను వేగంగా వెళ్లి ఢీకొట్టడంతో సిద్ధయ్య, సయ్యద్ బైక్ పైనుంచి కింద పడ్డారు. సిద్ధయ్య కాలు విరిగిపోవడమే కాక తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ఇరువురినీ కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కొద్దిసేపటికే సిద్ధయ్య మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బైక్ నడుపుతూ గాయాలకు గురైన సయ్యద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన సిద్ధయ్యకు ఇద్దరు కుమారులు సంతానం.

బస్ షెల్టర్లను బాగుచేయండి



పెచ్చులూడిన దిగువపాడు బస్ షెల్టర్



షెల్టర్‌లో కూర్చునేందుకు స్టాల్స్ లేని దృశ్యం



గార్గేయపురం బస్‌షెల్టర్ దుస్థితి



షెల్టర్‌లో అపరిశుభ్రత

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గ్రామాల్లో లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లను బాగు చేయలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో బస్సు షెల్టర్లను శుభ్రంగా ఉంచడంతో ప్రయణికులు కూర్చొని బస్సుల కోసం వేచి చూసేవారు. ప్రస్తుతం వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా మారియి. అలాగే షెల్టర్లు పెచ్చులూడి దెబ్బతినడంతో ప్రయాణికులు నిలువ నీడ లేక ఎండ, వానకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దిగువపాడు గ్రామం కర్నూలు, నంద్యాల జిల్లాకు సరిహద్దు గ్రామం. ఇక్కడి సమీపంలో మిడుతూరు మండల కేంద్రం ఉండటంతో ప్రయణికులు ఎక్కువగా ఉంటారు. గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టరు పెచ్చులూడి కూర్చోవడానికి ఇబ్బందికరంగా మారింది. దీంతో గ్రామం నుంచి నగరానికి వెళ్లి చదువుకునే పిల్లలు, కాలేజీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గార్గేయపురం బస్ షెల్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉండటం. మరోపక్క గ్రామ సచివాలయం ఉండటం వల్ల మహిళా ఉద్యోగులు ఇక్కడ బస్సుల కోసం వేచి ఉంటారు. బస్ షెల్టర్‌లో కూర్చోవడానికి నాపరాతి బండలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ శిథిలావస్థకు చేరాయి. అలాగే షెల్టర్ వ్యర్థాలతో నిండిపోయింది. వాటిని శుభ్రం చేయకపోవడంతో ఎవరూ వెళ్లడం లేదు. దీంతో ప్రయాణికులు నిలువ నీడ లేక, కూర్చోవడానికి చోటు లేక ఇబ్బందులు పాడుతున్నారు. ఎండకు ఎండాల్సిందే, వర్షం వస్తే అటూ ఇటూ పరుగెత్తాల్సిందే. ఇంతగా అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా బస్ షెల్టర్లను బాగు చేయించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.